క్లుప్తంగా

పరామర్శ

గార: కళింగపట్నం ఎంపీటీసీ సభ్యుడు కిలుగు అప్పలనాయుడు తండ్రి లక్ష్మణనాయుడు ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను ఎంపీపీ గొండు రఘురామ్ బుధవారం పరామర్శించి సానుభూతి తెలియజేసారు. పరామర్శలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ ముంజేటి కృష్ణమూర్తి, పార్టీ కన్వీనర్ పీస శ్రీహరిరావు, సర్పంచ్ తమ్మిన మౌనికా రాణి, తమ్మిన అప్పలరాజు తదితరులున్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు

జి.సిగడాం: సంక్రాంతి నేపథ్యంలో కోడిపందాలు నిర్వహించిన, పేకాట శిబిరాలు ఏర్పాటు చేసినా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై సామంతుల రామారావు హెచ్చరించారు. స్టేషన్‌లో బుధవారం మాట్లాడుతూ.. జూదం నిర్వహిస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో సంచరించే అపరిచితులపై అనుమానం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఇందులో భాగంగా స్వామి వారికి క్షీరాభిషేకాలు నిర్వహించినట్టు అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ తెలిపారు. స్వామికి పంచామృతాభిషేకాల సేవలో అధికసంఖ్యలో భక్తులు భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రదానం



ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న మహేష్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం గ్రామానికి చెందిన అలికాన మహేష్‌కుమార్ పీహెచ్‌డీని అందుకున్నారు. బుధవారం ఆంధ్రా విశ్వవిద్యాలయంలో వీసీ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి ఈయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కెమికల్ ఇంజినీరింగ్‌లో డాక్టర్ ఆశా ఇమ్మాన్యుయేల్ గైడ్‌గా మహేష్‌కుమార్ పీహెచ్‌డీ పూర్తిచేశారు.

గొడవ తీర్చేందుకు వెళ్లి ..

శ్రీకాకుళం క్రైమ్: గొడవ తీర్చేందుకై వెళినవారే గొడవ పడిన సంఘటన స్థానిక ఏడురోడ్ల కూడలిలో చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరి సత్యనారాయణ కాలనీకి చెందిన పప్పల జగన్, బొట్ట వెంకటరత్నంలు పక్క పక్కనే నివాసముంటున్నారు. ఇంటి గోడ విషయమై వీరిద్దరి మధ్య గొడవ రావడంతో కాలనీ పరిధిలో ఉన్న రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఇరువర్గాల వారు ఫిర్యాదు చేసుకున్నారు,. జగన్ తరఫున పంచిరెడ్డి లక్ష్మి, వెంకటరత్నం తరఫున సాదురెడ్డి లక్ష్మీనారాయణ పెద్దలుగా తగువును తీర్చడానికి వెళ్లారు. తీరా అక్కడ తగువు తేలకపోవడంతో ఇరువర్గాల వారు స్టేషన్ నుంచి బయటకు వచ్చి ఏడురోడ్ల కూడలి సమీపంలో మరోమారు వాదులాడుకున్నారు. మాటామాటా పెరిగి పెద్దలుగా వెళ్లిన లక్ష్మీనారాయణ, లక్ష్మిలు కూడా కొట్టుకున్నారు. దీంతో ఇరువర్గాలు వారు ఒకరిపై ఒకరు కేసు పెట్టుకోవడంతో రెండు కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు. లక్ష్మీనారాయణ మేస్త్రీ కాగా పని చేస్తుండగా పంచిరెడ్డి లక్ష్మి రోజువారి కూలి.

అల్లినగరంలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: అల్లినగరం గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

రెవెన్యూ సంఘం డైరీలు అందజేత



కలెక్టర్‌కు డైరీ అందజేస్తున్న రెవెన్యూ సర్వీసుల సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం రూపొందించిన రెవెన్యూ డైరీలను బుధవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌వో ఎం.రాజేశ్వరి, ఆర్‌డీవో బి.శాంతిలకు వారి వారి చాంబర్‌లో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసుల సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి జి.ఎల్.ఈ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు మురళీధర్ నాయక్, జాయింట్ సెక్రటరీలు డి.అమర్నాథ్, ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యూహెచ్‌సీల్లో
ఆధునిక సదుపాయాలు



అర్బన్ హెల్త్ సెంటరును ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన

• మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రభుత్వం అందించే వైద్య సౌకర్యాలపై ప్రజలకు నమ్మకం కుదిరే విధంగా ఆధునిక వసతులతో అర్బన్ హెల్త్ సెంటర్లను తీర్చిదిద్దుతున్నామని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. అరసవల్లి సమీపంలోని కొయ్యాన కన్నయ్య కాలనీలో రూ. 1.20 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా విపత్కర పరిస్థితిలో కూడా యూహెచ్‌సీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసిందన్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలకు హెల్త్ సెంటర్లు కీలకమయ్యాయన్నారు. 65 టెస్టులు వీటిలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆరు హెల్త్ సెంటర్లు పెడుతున్నామన్నారు. ఇలాంటి అభివృద్ధి పనులను చేయని గత ప్రభుత్వం ఇప్పుడు విమర్శలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ప్రజలకు ఒకప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం ఉండేది కాదని.. ఇప్పుడు అది పటాపంచలైందన్నారు. 12 వేల మందికి మున్సిపల్ పరిధిలో ఇళ్ల పట్టాలిప్పించామన్నారు. వలంటీర్ల వ్యవస్థ వచ్చాక తెల్లవారకముందే ఇంటికొచ్చి పెరిగిన రూ. 2,750 పింఛను అందిస్తున్నామన్నారు. మండల కేంద్రాలకు వెళ్లకుండానే గ్రామ సచివాలయాల్లోనే అన్ని పనులూ ప్రజలకు జరుగుతున్నాయన్నారు. ఇవన్నీ అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగాయా అని ప్రశ్నించారు. ప్రజల మద్దతు మరోసారి వైఎస్సార్‌సీపీకే ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పనితీరుపట్ల ప్రజలు విశ్వాసంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, డీఎంహెచ్‌వో మీనాక్షి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి.పద్మావతి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లి ఆశాదీపిక, తెలుగు సూర్యనారాయణ, గంగు సీతాపతి, తెలుగు రమేష్, రాయపల్లి అర్జున్, వడ్డీ ఉదయ్‌లు ఉన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

• ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఏడు మత్స్యకార పంచాయతీల్లోని సమస్యలు పరిష్కరించి వారి అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో డి.మత్స్యలేశం, బుడగట్లపాలెం, బడివానిపాలెం, కొచ్చెర్ల, అల్లివలస, జీరుపాలెం, కొవ్వాడ పంచాయతీలకు చెందిన మత్స్యకారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ.. సముద్ర తీరంలో తుఫాన్ స్టోరేజ్ భవనాలు నిర్మించాలని, విద్యుత్ సదుపాయం కల్పించాలని, డ్వాక్రా రుణాలు, గృహ నిర్మాణ బిల్లులు, రహదారి సమస్యలు, కొత్తముక్కాం గ్రామ కంఠం సమస్య పరిష్కరించాలని, కొచ్చెర్ల బీసీ హాస్టల్‌కు పక్కా భవనం ఏర్పాటు చేయాలని, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మత్స్యకార గ్రామాల్లో ఇంటింటికి మంచినీరు అందించాలని ప్రస్తావించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత శాఖాధికారులకు ఫోన్ చేసి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కొవ్వాడ మత్స్యకారులు మాట్లాడుతూ.. అణువిద్యుత్ ప్లాంట్‌కు సంబంధించి పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తే తప్పా గ్రామాల్లో అణు పనులు చేస్తే సహించేది లేదన్నారు. ఆర్‌అండ్‌ఆర్, యూత్ ప్యాకేజీలు, ఇళ్ల నష్ట పరిహారం పూర్తిస్థాయిలో అందించలేదని, పెండింగ్ భూ పరిహారం చెల్లించేలా చూడాలని ఎమ్మెల్యే కిరణ్ దృష్టిలో పెట్టారు. దీనిపై స్పందించిన ఆయన గ్రామాల్లోని అధికారులు వస్తే తనకు తెలియజేయాలని, పెండింగ్ సమస్యలపై అణువిద్యుత్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మైలపల్లి కామరాజు, మూగి శ్రీరాములు, అంబటి రాంబాబు, చీకటి యర్రయ్య, మైలపల్లి వెంకటేష్, మాగుపల్లి పొట్టివాడు, పట్టయ్య, జగ్గలు, ఉప్పాడ అప్పన్న, మూగి సన్యాసి, పిల్లతాతతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ మత్స్యకారులు పాల్గొన్నారు.

ఘనజీవామృతం తయారీపై అవగాహన



ఘనజీవామృతాన్ని తయారు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఘన జీవామృతం తయారీపై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవుపేడ, మూత్రలతో ఘనజీవామృతాన్ని రైతులే తయారు చేసుకోవచ్చునని వివరించారు. ఘనజీవామృతాన్ని దుక్కుల్లో వినియోగించడం వల్ల భూసారం పెరుగుతోందన్నారు. పంటలకు పూర్తిస్థాయి పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అరుణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల వర్తింపు

• ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరులోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తాన్ని 2,750 రుపాయలకు ముఖ్యమంత్రి పెంచారన్నారు. గత పాలకుల హయాంలో పింఛన్లు, సంక్షేమ పథకాలు వారి అనుచరులకే మంజూరు చేసేవారన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. టీడీపీ పాలనలో నాయకులు దోచుకున్నారు తప్పా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, బూత్ కమిటీ మండల కన్వీనర్ మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు కింతలి రమేష్‌బాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు లుకలాపు శ్రీనివాసరావు, అలుపున రమణమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

లావేరు: గుమడాం పంచాయతీలో నూతనంగా ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలను బుధవారం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ కొత్త వలంటీర్లకు పత్రాలను అందించారు. సక్రమంగా పని చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు, గుమడాం ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు, నాయకులు జగ్గరోతు తవిటినాయుడు, ముప్పిడి శ్రీరాములు, నాగం కనకరాజు, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

మేలుకొలుపు బృందానికి దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న డాక్టర్ శ్రీధర్

శ్రీకాకుళం కల్చరల్: మేలుకొలుపు బృందానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. కొన్నావీధి భీమేశ్వర భజన బృందం వారిచే 24 వసంతాల ధనుర్మాస మేలుకొలుపుల పండుగల్లో భాగంగా గోవిందనగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చలికాలం ధనుర్మాసంలో మేలుకొలుపులు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. నేటి తరం కూడా వీటిని కొనసాగిస్తూ ముందుకు తీసుకెళ్లడం ఎంతైనా అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా భక్తితోపాటుగా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందన్నారు. మేలుకొలుపులు బృందం సభ్యులకు మెడికవర్ ఆస్పత్రి తరఫున వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో 19వ డివిజన్ నాయకులు బిర్లంగి రామ్మోహన్‌రావు, బొమ్మన విజయకుమార్, డోల తవిటి నాయుడు, పాడిని నారాయణరావు, జవ్వాది రామకృష్ణ, శాసనపురిత్రినాధరావు, నేదూరి శ్రీనివాసరావు, సతివాడ రాము సతీష్ భజన బృందం సభ్యులు బలగ శివప్రసాద్‌దేవ్, మన్మథరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఔదార్యం



కాంతమ్మ కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం

లావేరు: మృతుల కుటుంబాలకు సచివాలయ ఉద్యోగులు ఆర్థిక సాయం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. వెంకటాపురం పంచాయతీ వార్డు సభ్యురాలు కింతాడ కాంతమ్మ భర్త అప్పారావు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. అలాగే ఇదే గ్రామానికి చెందిన వీఆర్వో కింతాడ స్వరాజ్యం అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుటుంబాలను వెంకటాపురం సచివాలయ ఉద్యోగులు బుధవారం పరామర్శించారు. అలాగే ఒక్కో కుటుంబానికి పది వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని లావేరు పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, వెంకటాపురం సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ, వార్డు సభ్యుడు పిన్నింటి సత్యం, సచివాలయం కార్యదర్శి లావణ్య, ఉద్యోగులు సంతోష్, వెంకటలక్ష్మి, ధర్మారావు, భారతి, పద్మజ, ఏఎన్‌ఎం భారతి, వలంటీర్లు పాల్గొన్నారు.

8న జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి మాస్టర్స్ బాడ్మింటన్ టోర్నమెంట్-2022-23 పోటీలు ఈ నెల 8న జరగనున్నాయని జిల్లా షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ తెలిపారు.ఇందులో రాణించిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు పంపిస్తామని చెప్పారు. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళం శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఆ సంఘ ఛైర్మన్ ఆర్.రాజేంద్రన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ధర్మాన చేతుల మీదుగా పింఛన్ల అందజేత

శ్రీకాకుళం రూరల్: గార మండలానికి చెందిన పలువురుకి మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం పెదపాడులోని తన క్యాంపు కార్యాలయంలో పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ఏడాది ప్రారంభంలోనే వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ చేయడం శుభపరిణామమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పింఛన్‌ను పెంచుతున్నారన్నారు. ప్రస్తుతం రూ.2,750 అందిస్తున్నట్టు పేర్కొన్నారు. పింఛన్‌పై చాలా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గార ఎంపీపీ గొండు రఘురామ్, నాయకులు ముంజేటి కృష్ణ పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి.. పింఛన్ అందజేసి..



పెంటయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు అనిల్‌కుమార్

లావేరు: బుడుమూరు గ్రామానికి చెందిన వృద్ధుడు మల్ల పెంటయ్య అనారోగ్యంతో విశాఖ షీలానగర్‌ని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల అతనికి మంజూరైన వృద్ధాప్య పింఛన్ గ్రామంలో తీసుకోవడానికి వీలుకుదరలేదు. దీంతో వలంటీరు అనిల్‌కుమార్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి పెంటయ్యకు పింఛన్ డబ్బులు అందజేసి ఆదర్శంగా నిలిచారు.

ఐటీఐ పాసైన వారికి బంపర్ ఆఫర్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇచ్చింది. పాలిటెక్నిక్ కోర్సుల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశాలను కల్పిస్తుంది. రెండేళ్ల ఐటీఐ కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారికి ఫిబ్రవరి 12 నుంచి 14వ తేదీ వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. అందులో ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్‌మోహనరావు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ ఐడీఐసీలో ఈ నెల 9 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జి.సిగడాం: గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి పొన్నాడ హరితాశ్రీ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం లోపించకుండా సిబ్బంది చూడాలన్నారు.

పిల్లలకు వ్యాక్సినేషన్ చేయించాలి

శ్రీకాకుళం: పిల్లలకు తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దీపికాప్రియాంక అన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని ఆదివారంపేట యూపీహెచ్‌సీలో ఐదేళ్లలోపు పిల్లలకు ఐపీవీ-3 అనే కొత్త వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. వైద్యురాలు, వైద్య సిబ్బంది పిల్లలకు వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో బలగ వార్డు హెల్త్ సెక్రటరీ గొల్లపల్లి సరిత పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీవో క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ఏపీ ఎన్‌జీవో సంఘం క్యాలెండర్‌ను రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల, టౌన్, జిల్లా సంఘం ఎన్నికలు జరుపుకోవడంతో పాటు కొద్దిరోజుల్లోనే క్యాలెండర్‌ను రూపొందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా సంఘ అధ్యక్ష కార్యదర్శులు హనుమంతు సాయిరాం, ఎన్‌జీవో సంఘం నేతలు కంఠ జయరాం, కాయల శ్రీనివాసరావు, బడగల పూర్ణచంద్రరావు, టి.సోమేశ్వరావు, నారాయణరావు పాల్గొన్నారు.

అంధుల అక్షరప్రదాత 'లూయిస్ బ్రెయిలీ'



గార: కేక్‌ను కట్ చేస్తున్న విద్యార్థులు

గార: అంధుల కోసం అక్షరమాలను తయారు చేసిన ఫ్రెంచ్ విద్యావేత్త లూయిస్ బ్రెయిలీ వారిపాలిట అక్షరప్రదాత అయ్యారని ఎంఈవో అంబటి సోమేశ్వరరావు కొనియాడారు. కుమ్మరిపేటలోని భవిత విద్యాకేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లల మధ్య లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రెయిలీ అక్షరాలతో మేధావులుగా ఎంతో మంది తయారయ్యారన్నారు. మంచి లక్ష్యంతో జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. బ్రెయిలీ అందించిన అక్షరమాలను వివరించారు. కార్యక్రమంలో తూలుగు యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీ రమణమూర్తి, స్థానిక పాఠశాల హెచ్‌ఎం జగదీష్, సీజీవీఎల్ ఎల్.అమ్మాజీ, భవిత రిసోర్సు పర్సన్ ఎ.రఘులక్ష్మి పాల్గొన్నారు.

కొయ్యాం కళాశాలలో రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



నిర్ధారణ పరీక్షలు చేస్తున్న రెడ్ క్రాస్ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఇండియాన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రుధిర కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించగా 310 మంది విద్యార్థులకు తమ బ్లెడ్ గ్రూప్‌ను తెలియజేశారు. రక్తం గ్రూప్ తెలియటం వల్ల అవసరమైన వారికి రక్తదానం చేయటం, అత్యవసర సమయంలో రక్తం స్వీకరణకు అవకాశం ఉంటుందని సిబ్బంది తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ సిబ్బంది కె.సత్యనారాయణ, బి.శ్రీధర్, జి.పవన్‌కుమార్, కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

ఇద్దరు సీఐల బాధ్యతల స్వీకరణ



రణస్థలం: ఎస్.అదామ్, రణస్థలం సీఐ



శ్రీకాకుళం క్రైమ్: బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

రణస్థలం: జె.ఆర్.పురం సీఐగా నియమితులైన ఎస్.అదామ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. సంక్రాంతి నేపథ్యంలో కోడిపందాలు, పేకాట వంటి జూద క్రీడలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలో 102 మందిపై రౌడీషీట్ నమోదై ఉన్నట్టు పేర్కొన్నారు. వీటిలో జె.ఆర్.పురం-34, ఎచ్చెర్ల-34, లావేరు-20, జి.సిగడాం-14 మంది ఉన్నారన్నారు. 79 మందిపై దొంగతనాలు చేస్తున్న అనుమానిత కేసులు ఉన్నట్టు వివరించారు. నవభారత్, చిలకపాలెం, జె.ఆర్.పురం, పైడిభీమవరం కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించే దిశగా స్థానిక ఎస్సైల సహకారంతో చర్యలు చేపడతామన్నారు.

- శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పప్పల శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం తన కార్యాలయంలోని చాంబరులో విధులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004లో సివిల్ ఎస్సైగా విధుల్లో చేరినట్టు చెప్పారు. ఏసీబీలో సీఐగా, రాజాం రూరల్, పట్టణ సీఐగా పనిచేశానన్నారు. ఐదు నెలల ముందు విశాఖ రేంజి వీఆర్‌కు వెళ్లినట్టు పేర్కొన్నారు. తన పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఎస్పీని కలిసిన సీఐలు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రెండో పట్టణ, జె.ఆర్.పురం సీఐలుగా బాధ్యతలు చేపట్టిన పప్పల శ్రీనివాసరావు, ఆదాం జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పోతయ్యవలసలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: పోతయ్యవలస గ్రామంలో 104 వాహన సిబ్బంది బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించా రు. దీన్ని సర్పంచ్ కొంపెల్ల అప్పన్న ప్రారంభించా రు. వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి మందులను అందజేశారు. వలంటీర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శక పాలనే లక్ష్యం



క్రిష్టాపురంలో మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

• గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: పారదర్శక పాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. క్రిష్టాపురం సచివాలయ పరిధిలో గొర్లెపేట, క్రిష్టాపురం పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, మూడున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బుక్‌లెట్‌ను అందజేశారు. ఏమైన సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యలు పరిష్కరించాలని, హౌసింగ్ రుణాలు ఇప్పించాలని, కాలువలు నిర్మించాలని పలువురు ఎమ్మెల్యేను కోరుగా.. సమస్యలు త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయిపురెడ్డి భుజంగరావు, మండల బూత్ కన్వీనర్ చిల్లా వెంకటరెడ్డి, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, మైలపల్లి కామరాజు, పైడి శ్రీనివాసరావు, మహంతిపాలెం సర్పంచ్ గొర్లె అప్పలనర్సునాయుడు, క్రిష్టాపురం సర్పంచ్ కంబపురామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మహంతి చినరామినాయుడు, నాయకులు సన్యాన సత్యం, అప్పలనాయుడు, మహంతి జనార్ధన, కుప్పిలి లక్ష్మణ, లింగాల రమణ, గంట్యాడ అప్పలనాయుడు, మహంతి అసిరినాయుడు, రామసత్యం, గంట్యాడ శ్రీరాములు, తవుడు, సూర్యనారాయణ, అప్పలరాముడు పాల్గొన్నారు.